క్లుప్తంగా

జనసేన శ్రేణుల అత్యుత్సాహం

వైఎస్సార్ విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీ ఏర్పాటు



ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఫ్లెక్సీ కట్టిన దృశ్యం

కొత్తపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో జనసేన పార్టీ నాయకులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. మండలంలోని ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఫ్లెక్సీలతో పూర్తిగా మూసివేశారు. ఫ్లెక్సీని విగ్రహానికి కట్టడంపై వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.వెంకటనారాయణ మంగళవారం తెలిపారు. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10. 30 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. దీనికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతో హాజరు కావాలని అన్నారు.

మహిళ కాలిపై కణితి తొలగింపు



కణితి తొలగిస్తున్న డాక్టర్ వినయ్

పిఠాపురం: పిఠాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో అరుదైన ఆపరేషన్ చేసి ఒక మహిళ కాలిపై కణితిని విజయవంతంగా తొలగించారు. పిఠాపురానికి చెందిన ఎస్ పాప కొన్ని నెలలుగా కాలిపై కణితి ఏర్పడి తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఆమె మంగళవారం పిఠాపురం మంగయ్యమ్మరావుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులు డాక్టర్ యాళ్ల వినయ్ వద్దకు వచ్చి తన బాధ చెప్పుకుంది. దీంతో ఆమెను పరీక్షించిన ఆయన ఆపరేషన్ చేసి ఆమె కాలికి ఉన్న కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులకు డైరీల పంపిణీ



ఉపాధ్యాయులకు డైరీలు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పిఠాపురం: యూటీఎఫ్ గొల్లప్రోలు మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు డైరీలు, సీఎల్ పుస్తకాలు పంపిణీ చేసారు. వీటిని మండల విద్యాశాఖాధికారి బీవీ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ ఎస్ఎస్ఎస్ ప్రకాష్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చేదులూరి సూరిబాబు ఆవిష్కరించారు. అనంతరం గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు డైరీలు, సీఎల్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవీ సత్యనారాయణ, డి వీరాస్వామి, ఈ గోవిందరాజులు, గణేష్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీర ప్రాతంలో ఆర్డీవోల పర్యటన



ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవోలు కిశోర్, సీతారామరావు

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు కిశోర్, సీతారామరావు మంగళవారం పర్యటించారు. బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉప్పాడ తీర ప్రాంతంలో కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు, నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకోనున్నారు. ఈ పర్యటనకు భారీ సంఖ్యలో జనాభా తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దారు సుందర్‌రాజు, ఎంపీడీవో వెంకటనారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- భయపెడుతున్న సీజనల్ వ్యాధులు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ

కొత్తపల్లి: మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు వర్షాకాలంలో ఎక్కువగా వ్యాపిస్తాయి. ప్రస్తుతం డయేరియా కేసులు నమోదవడంతో ప్రజలు హడలిపోతున్నారు. భయం అవసరం లేదంటూ అభయమిస్తున్నాయి వైద్య వర్గాలు. సీజనల్ వ్యాధుల్ని కట్టడి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామంటున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది. వ్యాధులపై ప్రజల్ని అప్రమత్తం చేసే దిశగా క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. కొత్తపల్లి మండలంలో నాగులపల్లి, కొమరగిరి, కొత్తపల్లి పీహెచ్‌సీల పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. తాగునీటి నుంచి పారిశుద్ధ్య నిర్వహణ తదితర అన్ని అంశాలపై ప్రజలను చైతన్యపరుస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మలేరింయా, టైఫాయిడ్, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో మొబైల్ బృందాలు వార్డు స్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు సూచిస్తున్నారు.

దోమకాటుతో డెంగీ

డెంగీ కారక దోమ పగటిపూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టిన వారం తర్వాత ఒక్కసారిగా తీవ్ర జ్వరం వస్తుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి కలుగుతుంది.

నోరు ఎండిపోవడం, అధిక దాహం, ఒళ్లు నొప్పులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు పడిపోవడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి.

దోమను ఇలా గుర్తించండి

నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. పగటిపూట ఎక్కువగా సంచరిస్తుంది. మూతల్లేని నీటి ట్యాంకులు, రోడ్లపై నిలిచే నీరు, పాత టైర్లు, ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు, కూలర్లలో నిల్వ ఉంటే నీటిలో డెంగీ కారక దోమ వృద్ధి చెందుతుంది.



కొత్తపల్లి రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



ఉప్పాడలో అధ్వానంగా పారిశుద్ధ్యం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యాధి నివారణకు ప్రధానంగా దోమలను నిర్మూలించాలి.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

డయేరియా

- కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవడం ఈ వ్యాధి బారిన పడతారు. వ్యాధి సోకిన వారికి నీళ్ల విరేనాలు అవుతాయి. జ్వరం కూడా వచ్చే అవకాశం ఉంది.రోజులో నాలుగు నుంచి ఐదు సార్లు విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి.
- ఎక్కువ సార్లు విరేచనాలు అవడం వల్ల శరీరంలోని నీరు, ఖనిజ లవణాలు, గ్లూకోజ్ శాతం తగ్గి రోగి నీరస పడతాడు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ వ్యాధి చిన్నారులు, మధుమేహ రోగులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.వ్యాధి సోకిన వ్యక్తికి కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. నిల్వ ఉంచిన ఆహారం జోలికి వెళ్లవద్దు.

మలేరియా

- ఈ వ్యాధికి కారణమయ్యే దోమలు మురుగు కాలువల్లోని నీటిలో వృద్ధి చెందుతాయి. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకుంటే ప్రమాదకరం. మనిషి లివర్, కిడ్నీ, గుండె, రక్త నాళాలు, మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

గుర్తించేదెలా

- దోమ కుట్టిన 10 నుంచి 14 రోజుల్లో మలేరియా లక్షణాలు బయట పడతాయి.
- రోజు విడిచి రోజు జ్వరం వస్తుంది. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, చలిగా ఉంటుంది.
- చెమటలు పట్టడం, కొన్ని సార్లు వాంతులు కూడా అవుతాయి. రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు, శరీరంలోకి ప్రవేశించి తర్వాత కొద్దిరోజులకు మాత్రమే ఇవి పరీక్షల్లో బయటపడతాయి. సెరిబ్రల్ మలేరియా ప్రాణాంతకం, ఈ విషయంలో చిన్నారులను జాగ్రత్తగా సంరక్షించాలి.

దోమల నివారణకు చర్యలు

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు కాలువల్లో చెత్తా చెదారం వేయకుండా మురుగు నీరు ప్రవహించే విధంగా చూడాలి. కుళాయిల లీకేజీ అరికట్టాలి. ఎయిర్ కూలర్లలో నీటిని వారానికి ఒకసారి మార్చాలి. పూల కుండీలు, ఇంటి పైకప్పుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమల బెడద తగ్గడం కోసం మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం.

– డాక్టర్ సుష్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొత్తపల్లి

అంటువ్యాధులను అడ్డుకుందాం



పిఠాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: మారిన వాతావరణంతో విజృంభిస్తున్న అంటువ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా పిఠాపురం సీహెచ్‌సీ వైద్యులు యాళ్ల వినయ్ ఆధ్వర్యంలో మంగళవారం పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుల్లో ర్యాలీ నిర్వహించి అంటువ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాచి ఒడకట్టిన నీటినే తాగాలని, వేడి పదార్థాలనే తినాలని సూచించారు. చేతులు పరిశుభ్రంగా కడిగిన తరువాతే భోజనం చేయాలని వివరించారు. దోమల వృద్ధిని అరికట్టాలని ఆయన ప్రజలకు సూచించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో మంగళవారం అంటు వ్యాధులు ప్రబలకుండా దోమలు పెరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఫాగింగ్ యంత్రాలతో వీధుల్లో దోమల మందు పిచికారీ చేశారు.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు



ఉప్పాడ పిఠాపురం రోడ్డులో కొత్తపల్లి వాకతిప్ప యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: ఉప్పాడ– పిఠాపురం రోడ్డుపై వాహనాల వేగాన్ని నిరోధించే విధంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాకతిప్పలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేగంగా దూసుకు వెళుతున్న వాహనాల కారణంగా ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాకతిప్ప ఎంపీపీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు యూనియన్ బ్యాంకు వద్ద తరచూ రోడ్డు దాటి పాఠశాలకు వెళుతున్నారు. ఏ వైపు నుంచి ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇక్కడ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకుకు వెళ్లే ఖాతాదారులు రోడ్డు దాటే సమయంలో భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లే రోడ్డు ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



మామిళ్లదొడ్డి పాఠశాలలో విద్యార్థుల వర్కు బుక్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ

సామర్లకోట: పాఠశాలల్లో విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలో మామిళ్లదొడ్డ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. శానిటేషన్ సక్రమంగా లేక పోవడంపై ఆయన అసంతృప్త వ్యక్తం చేశారు. పాఠశాలలోని పరిసరాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి విద్యార్థీ మధ్యాహ్న భోజనం తినేలా మెనో ప్రకారం రుచికరంగా తయారు చేయాలన్నారు. ఈ మేరకు ప్రతి రోజు భోజనాన్ని ఉపాధ్యాయులు రుచి చూడాలన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలన్నారు. చేతి రాత బాగుంటే ఉంటే భవిష్యత్‌లో మంచి పార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా బడి బయట పిల్లలు లేకుండా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల విద్యార్థు లలో భయం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు ఆకర్షణీయమైన బోధన చేయడం ద్వారా ప్రతి రోజు పాఠశాలకు హాజరవుతారని వివరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్యవివాహాల నిర్మూలనపై కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం

కిర్లంపూడి: అభం శుభం తెలియని చిన్నారులకు బాల్యవివాహాలు చేసి వారి స్వేచ్ఛను హరించడం నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. మహిళాభివృద్ధి, బాలల పరిరక్షణ విభాగం, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కిర్లంపూడిలోని వెలుగు కార్యాలయం వద్ద అతిసార వ్యాధి, బాల్యవిహాల నిర్మూలనపై కళాజాత ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే పోక్సో చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. చిన్నవయసులోనే వివాహం చేయడం వల్ల గర్భస్రవం, మాతాశిశు మరణాలు, అంగవైకల్యం, రక్తహీనత వంటి అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. చిన్నారులను చక్కగా చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని తల్లిదండ్రులను కోరారు. మీ గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే 1098 ఉచిత హెల్ప్‌లైన్ లేదా 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అతిసార వ్యాధి, బాల్యవిహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సలర్ బి.దుర్గారాణి, ఏంఈఓలు టి.జోషఫ్. ఎం.చిన్నారావు, సూపర్‌వైజర్స్ బూసమ్మ, సునీత, అంగన్‌వడీ, ఆశలు, పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

శంఖవరం: గ్రామంలోని రేషన్ దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎంఎస్ఓ వీరాస్వామి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఒకటో షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 9,250 కేజీల బియ్యం గుర్తించారు. మూడో షాపులో 12.5 కేజీలు పంచదార తక్కువ ఉన్నట్లు నిర్ధారించారు. ఆయా దుకాణాల యాజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. దాడులలో విజిలెన్స్ ఎస్సై జగన్నాథ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేత ఇంటికి వెళ్తేనే పింఛన్లు!

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజు మంగళవారం మండల పరిధిలో జి.మేడపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుని ఇంటి వద్ద పంపిణీ చేయడంపై పింఛను లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం నాయకుని ఇంటి వద్దకు వెళ్లని వారికి పింఛన్ల పంపిణీ చేయలేదని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మోరంపూడి శ్రీరంగనాయకులు, పుట్టా బుజ్జిబాబు ఆరోపించారు. గతంలో ఎన్నడూ ఇటువంటి సంస్కృతి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి పింఛన్ల కోసం వచ్చిన వారిని తెలుగుదేశం నాయకుని ఇంటి వద్దకు రప్పించుకున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు విచారణ చేసిన సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని కొరుతున్నారు.

నేడు మండల సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశంలో భాగంగా నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన సమీక్షకు ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

బెట్టింగులతో భవిత బేజారు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: ఒకప్పుడు నగరాలకు పరిమితమైన బెట్టింగ్‌ల సంస్కృతి నేడు పల్లెలకు పాకిందని, బెట్టింగ్‌లతో యువతకు ప్రాణ సంకటంగా మారుతోందని, చాలా మంది అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తొలుత సరదాగా బెట్టింగ్‌లు మొదలు పెట్టి కాస్త డబ్బులు రాగానే ఆశ పెరిగి ఉన్నదంతా ధారపోసి నష్టపోతున్నారన్నారు. కొందరు అప్పులు చేసి బెట్టింగ్‌లకు పాల్పడి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలని బెట్టింగ్‌లు పాల్పడే యువత చదువుల్లో కూడా వెనకపడుతున్నారని, దీనిని అరికట్టేందుకు కఠినమైన చట్టాలను అమలులోకి తీసుకురావలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటాలి

బోట్‌క్లబ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మ పేరు మీద ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడా వెంకటనారాయణ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక 6వ డివిజన్‌లో రేచర్లపేటలో మంగళవారం మొక్కలు నాటారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నుంచి ఆయన జయంతి జులై 6 వరకూ ఈ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మొక్కకు చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేసి కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం బీజేపీ నాయకులు తన తల్లి పేరుతో మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు ఏడిద కృష్ణ, గాలిదేవర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌తో అప్రమత్తత అవసరం



విద్యుత్ భద్రతా వారోత్సవాల ముగింపులో మాట్లాడుతున్న ప్రాంతీయ అధికారి కాంతారావు

- ప్రాంతీయ ఏపీ ఈపీడీసీఎల్ అధికారి
- రాక్ సిరామిక్స్‌లో ముగిసిన విద్యుత్తు భద్రత వారోత్సవాలు

సామర్లకోట: ప్రస్తుత ప్రపంచంలో విద్యుత్తు వాడకం లేని వ్యక్తి లేడని, అటువంటి విద్యుత్ వాడకంపై అప్రమత్తంగా భద్రతతో ఉండాలని ప్రాంతీయ ఏపీ ఈపీడీసీఎల్ అధికారి హెచ్ కాంతారావు అన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని జాతీయ విద్యుత్ వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాక్ సిరామిక్స్‌లో ఉద్యోగులు, కార్మికులకు విద్యుత్‌తో పాటు అన్ని రకాలుగా భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు టైల్స్ ప్లాంటు హెడ్ వినోద పైక వాసుదేవ, హెచ్ఆర్ హెడ్ టి.నిరజ్‌కుమార్ తెలిపారు. విద్యుత్తు ప్రమాదాలు, వాటిని నివారణకు సంబంధించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీని వల్ల గత ఏడాది ఎటువంటి ప్రమాదాలకు అస్కారం లేకుండా చేశామని తెలిపారు. ఈ మేరకు ఎలక్ట్రికల్ విభాగం అధికారులు శ్రీనుబాబు, బాలాజీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ వేర్ హెడ్ చెల్లదురై, పీఆర్వో వీజీఎస్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి హామీ బేఖాతరు



రాక్ సిరామిక్స్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

- దిగిరాని రాక్ సిరామిక్స్ యాజమాన్యం
- కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

సామర్లకోట: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి తమను విధులలోకి తీసుకొనే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రాక్ సిరామిక్స్‌లో తొలగింపునకు గురైన కార్మికులకు న్యాయం చేయాలని కొరినా యాజమాన్యం స్పందించడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ అన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు ఫ్యాక్టరీ వద్ద నిర్వహిస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 19 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి కార్మికులను ఎన్నికల కోడ్ విడుదల అయిన సమయంలో తొలగించి ఇప్పటికి 78 రోజులు అయిందన్నారు. గత 19 రోజులుగా గేటు వద్ద కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మూర్తి, ప్రభుదాసు, సతీష్‌కుమార్, శివనారాయణ, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌కు సత్కారం



డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ అనురాధ దంపతులను సత్కరిస్తున్న ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు

కాకినాడ క్రైం: గత నెల 30న పదవీ విరమణ చేసిన జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటరెడ్డిని రంగరాయ వైద్య కళాశాల అధికార బృందం ఘనంగా సత్కరించింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవిలు వెంకటరెడ్డి, అనురాధ దంపతులను సత్కరించి వారు రోగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. సర్జరీ విభాగంలో ఎనలేని సేవలు అందించిన డాక్టర్ వెంకటరెడ్డి డిప్యూటీ సూపరింటెండెంట్ హోదాకు వన్నె తెచ్చారన్నారు. నేటి తరం విధి నిర్వహణలో ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలన్నారు. యావత్ ఉద్యోగ జీవితాన్ని పూర్తి నిజాయితీతో నిర్వర్తించిన ఆయనపై ఏనాడూ ఎటువంటి ఆరోపణ లేకపోవడం సహోద్యోగులుగా తమకు గర్వకారణమని పలువురు వైద్యులు కొనియాడారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో కొనసాగాలని డీఎంఈ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆకాంక్షించారు. సర్జరీ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు పాల్గొన్నారు.